క్లుప్తంగా

వరుణుడికి ప్రత్యేక పూజలు



దేవరపల్లి కోదండ రామాలయం వద్ద పాలు పొంగిస్తున్న రైతులు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో వర్షాలు కురవాలని కోరుతూ రైతులు వరుణ దేవుడికి పూజలు చేశారు. గురువారం దేవరపల్లిలోని కోదండ రామాలయం వద్ద రైతులు పాలు పొంగించి వరుణుడిని ఆరాధించారు. పాల పొంగుల ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ విధంగా పాలు పొంగిస్తే వర్షాలు కురుస్తాయని రైతుల నమ్మకం. పూర్వకాలంలో వర్షాలు పడడం ఆలస్యమైతే గ్రామాల్లో వసంతాలు పోయడం, కప్పలకు పెళ్లిలు చేసి ఊరేగించడం, పాలు పొంగించడం వంటివి చేస్తే వర్షాలు సమృద్ధిగా కురిసేవని రైతులు తెలిపారు.

నల్లజర్ల: స్థానిక వెంకమ్మ చింతచెరువు ప్రాంతంలో గ్రామస్తులు, టి.టి.డే ఆధ్వర్యంలో సుమారు రూ.5 కోట్లతో కల్యాణ వేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి గాను ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారవరం సిద్ధాంతి రావిపాటి ప్రసాద్ ఆ ప్రదేశంలో నాగలి కట్టి విత్తనాలు చల్లారు. సెప్టెంబర్ 3న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆలయానికి శంకుస్థాపన జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ తెలిపింది.

విలీనం వద్దని ఖాతాదారుల నిరసన



చిన్నాయగూడెం కెనరా బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

దేవరపల్లి: చిన్నాయగూడెం కెనరా బ్యాంకు బ్రాంచిని సమీపంలోని యాదవోలు బ్రాంచ్‌లో విలీనానికి వ్యతిరేకంగా ఖాతాదారులు నిరసన తెలిపారు. గురువారం ఆ బ్రాంచ్ వద్ద ఖాతాదారులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 ఏళ్లగా రైతులు, ప్రజలకు సేవలు అందిస్తూ లాభాల బాటలో నడుస్తున్న బ్రాంచిని యాదవోలు బ్రాంచిలో విలీనం చేయడం వల్ల ఇబ్బందులు పడతామని అన్నారు. వ్యవసాయ రంగానికి ఈ బ్రాంచి ఎంతో ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. బ్యాంకును తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని బ్యాంకు డీజీఎం పులి రూపస్‌కు ఖాతాదారులు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి బ్రాంచి ఇక్కడే కొనసాగించేలా కృషి చేస్తానని ఆయన ఖాతాదారులకు హామీ ఇచ్చారు.

జెడ్పీటీసీలకు ముగిసిన శిక్షణ

నల్లజర్ల: సామర్లకోటలో ఈ నెల 12 నుంచి 14 వరకూ జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులకు నిర్వహించిన మూడో బ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. నిధులు, విధి విధానాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా పరిషత్ సమావేశాల్లో ఆయా అంశాల ప్రస్తావన వంటి అంశాలపై ఇచ్చిన శిక్షణ తమకు ఎంతగానో దోహదపడిందని నల్లజర్ల జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి అన్నారు. శిక్షణ అనంతరం అధికారుల నుంచి ఆమె సర్టిఫికెట్ అందుకున్నారు.

జీవీ కిడ్నాప్‌తో కలవరం

దేవరపల్లి: విశాఖపట్నం స్మార్ట్ సిటీ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్, గోపాలపురం నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జీవీ) కిడ్నాప్ వార్త స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కలవరం రేపింది. గురువారం ఉదయం జీవీ కిడ్నాప్‌కు గురైనట్లు సమాచారం తెలుసుకున్న దేవరపల్లి మండలం పల్లంట్లలోని తన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గ్రామస్తులు, నియోజకవర్గంలోని పలువురు పార్టీ శ్రేణులు జీవీ తండ్రి, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమనేని జనార్దనరావును కలసి పరామర్శించారు. జీవీ కుటుంబ సభ్యులు, పలువురు పార్టీ శ్రేణులు, అభిమానులు హుటాహుటిన విశాఖకు బయలుదేరి వెళ్లారు. కిడ్నాపర్ల నుంచి జీవీ విడుదల కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పీజీ ఈసెట్‌లో పదో ర్యాంక్



కవల రామతేజ

చాగల్లు: పీజీ ఈసెట్ ఫలితాల్లో చాగల్లు మండలం ఊనగట్ల గ్రామానికి చెందిన కవల రామతేజకు రాష్ట్ర స్థాయి పదో ర్యాంక్ వచ్చింది. ఈ మేరకు గురువారం రామతేజ విలేకరులతో మాట్లాడుతూ తాను పదో తరగతి వరకూ నిడదవోలు విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదివానన్నారు. రాజమహేంద్రవరం శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్, వైజాగ్ గాయత్రి పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్‌లో డిప్లమో చేశానన్నారు. తన తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఈ ర్యాంకు సాధించానని తెలిపారు. తండ్రి నాగేశ్వరరావు వ్యవసాయం చేస్తుండగా, తల్లి సూర్యకుమారి గృహిణి అని అన్నారు. కెమికల్ ఇంజినీర్‌గా భవిష్యత్తులో స్థిరపడాలన్నదే లక్ష్యమని రామతేజ తెలిపారు.

ముత్యమై మెరిసి.. మురిసి

- 'జగనన్న ఆణిముత్యాలు' ద్వారా ప్రోత్సాహకాలు
- పది, ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థులకు సత్కారాలు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరికీ విద్య దరిచేరింది.. పేదల ఇంట చదువుల పంట పండింది.. అలాంటి మట్టిలో మాణిక్యాలను ప్రభుత్వం సత్కరిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పది, ఇంటర్‌లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా అవార్డులు అందిస్తోంది. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి, వారి తల్లిదండ్రులు, ప్రిన్సిపల్‌ను సత్కరించడమే కాకుండా విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్లు అందజేస్తుంది. డివిజన్ పరిధి కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో ఇంటర్, పదో తరగతి చదివిన 282 మంది విద్యార్థులకు వివిధ కేటగిరీల వారీగా అవార్డులు అందిస్తుంది. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయిలో ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ప్రోత్సాహకం అందజేస్తారు. ఇలా మూడు నియోజకవర్గాల నుంచి 12 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలకు నాలుగు గ్రూపుల నుంచి నలుగురిని ఎంపిక చేస్తారు. ఇందులో జిల్లా స్థాయికి రూ.50 వేల చొప్పున, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి రూ.లక్ష చొప్పున నగదు అందజేస్తారు. రాష్ట్ర స్థాయి జాబితా ఇంకా రాలేదు. అవార్డుల అందజేతకు నియోజకవర్గ స్థాయిలో కొవ్వూరు పీఎంఎం హైస్కూలులో గురువారం కార్యక్రమం జరిగింది. 16న ఉదయం 9 గంటలకు నిడదవోలు మెడరస్ రూఫ్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో సత్కార సభ నిర్వహిస్తారు. గోపాలపురం నియోజకవర్గానికి సంబంధించి ఇంకా తేదీ ఖరారు కాలేదు.

ప్రతిభకు పతకాల పంట

ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ, జెడ్పీ హైస్కూల్, బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన వారిని ఎంపిక చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.వెయ్యి చొప్పున అందజేస్తారు. డివిజన్‌లోని 82 హైస్కూల్ స్థాయిలో 246 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. నియోజకవర్గంలో ప్రథమ స్థానానికి రూ.15 వేలు, ద్వితీయానికి రూ.10 వేలు, తృతీయానికి రూ.5 వేల చొప్పున ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో ఐదు మెనేజ్‌మెంట్ కళాశాలల వారీగా ప్రథమానికి రూ.50 వేలు, ద్వితీయానికి రూ.30 వేలు, తృతీయానికి రూ.15 వేల చొప్పున ఇస్తారు.



కొవ్వూరు నియోజకవర్గ స్థాయి ఎంపీసీ గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన హరితకు అవార్డు అందజేస్తున్న మంత్రి తానేటి వనిత

జాబితాలు సిద్ధం



జగనన్న ఆణిముత్యాలు ద్వారా నియోజకవర్గంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డుల అందజేతకు జాబితాలు సిద్ధం చేశాం. వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పీవీవీ సత్యనారాయణ నియోజకవర్గ, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థికి రెండూ కలిపి రూ.65 వేలు అందనుంది.

–టి.సునీల్ జయచంద్ర, జగనన్న ఆణిముత్యాలు కోఆర్డినేటర్, కొవ్వూరు

ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలు



ఇంటర్ హెచ్ఈసీ గ్రూపులో 910 మార్కులు సాధించాను. దీంతో జగనన్న ఆణిముత్యాలు ద్వారా రెండు అవార్డులకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. పేద విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఇలాంటి పథకాలను రూపొందించడం అభినందనీయం. ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించవచ్చు.

–పీవీవీ సత్యనారాయణ, విద్యార్థి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేగేశ్వరపురం

ఆనందంగా ఉంది..



అత్యధిక మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు ద్వారా అవార్డులకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ పాఠశాల్లో చదివే ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం. పదో తరగతిలో 585 మార్కులు సాధించాను. దీనికి ఉపాధ్యాయుల తోడ్పాటు ఎనలేనిది.

–గునపరెడ్డి సత్య అనూషదుర్గ, జెడ్పీ హైస్కూల్, వాడపల్లి

సమష్టి కృషితో ఫలితాలు



మా స్కూల్ పదో తరగతి విద్యార్థిని అనూష దుర్గ 585 మార్కులు సాధించి జిల్లా స్థాయి రెండో స్థానంలో నిలిచింది. పాఠశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో అవార్డులు దక్కడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులంతా సమష్టి కృషితో మంచి ఫలితాలు సాధించాం.

–బి.యుగంధర కుమార్, హెచ్ఎం, వాడపల్లి

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ప్రతిభను ప్రోత్సహించేందుకే 'జగనన్న ఆణిముత్యాలు'
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ప్రధానోపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందన్నారు.

గత టీడీపీ ప్రభుత్వం పాఠశాలను పూర్తిగా విస్మరించిందన్నారు. నేడు సర్కారు బడులు కొత్తరూపును సంతరించుకుని కార్పొరేట్‌కు ధీటుగా అభివృద్ధి చెందాయన్నారు. ఇంగ్లిషు మీడియం బోధన అందుబాటులోకి తీసుకు రావడంతో అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయన్నారు. మేనమామలా పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి జగనన్న పరితపిస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు తీసుకుని రావడం, మెరుగైన పౌష్టికాహారం అందించడం, నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం చేశారన్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లల చదువు భారంగా మారకూడదని జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి బృహత్తర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. విద్య విలువ తెలిసిన వ్యక్తిగా సీఎం జగన్ విద్యార్థుల ప్రతిభకు గుర్తింపునిస్తూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. అనంతరం విద్యార్థులకు అవార్డులు అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, డీఎల్‌డీఓ శాంతమణి, డీవైఈఓ జేఎస్‌వీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం, నిందితుడితో సివిల్ సప్లయిస్, విజిలెన్స్, పోలీసు అధికారులు

కొవ్వూరు: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. కాపవరం నుంచి కోలమూరు వెళుతున్న ఆటోలో 18 బస్తాల్లో 800 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ జి.బాపిరాజు తెలిపారు. ఆటోను స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసులకు అప్పగించామన్నారు. ఈ మేరకు కోరుకొండకు చెందిన వ్యాపారి నల్లమిల్లి నరసింహమూర్తిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. బియ్యం తరలింపునకు వినియోగించిన ఆటో డ్రైవర్, యజమానిపై కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు: స్థానిక విద్యానగర్ 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, శెట్టిపేట మినీ ఫీడర్ల సాంకేతిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని గురువారం నిడదవోలు విద్యుత్ శాఖ డీఈఈ బి.వీ రఘద్రరావు తెలిపారు. పట్టణంలో విద్యానగర్, బాలాజీనగర్, ఎస్టీ కాలనీ, శాంతినగర్‌లలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వద్దు

తాళ్లపూడి: విధుల నిర్వహణలో అలసత్వం లేకుండా పనిచేయాలని పంచాయతీల సిబ్బందికి ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. గురువారం మలకపల్లి, తిరుగుడుమెట్ట పంచాయతీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయాల ద్వారా సేవలను సక్రమంగా అందజేయాలన్నారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామారావు, కార్యదర్శులు కామేశ్వరి, చంద్రశేఖర్, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

నిడదవోలు రూరల్: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యల పరిష్కరించాలని కోరుతూ సమిశ్రగూడెం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సదుపాయాలు కల్పించాలని కోరుతూ గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సీహెచ్‌టీవీ పుష్ప, కోశాధికారి వి.శ్రీదేవి, ఎస్.కాంతమణి, బీవీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన



అనంతపల్లిలో జన భాగీదారి కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి తదితరులు

నల్లజర్ల: పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన పెంచడానికే జన భాగీదారి కార్యక్రమం అమలు చేస్తున్నట్లు ఐసీడీఎస్ అనంతపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కృష్ణవేణి అన్నారు. గురువారం అనంతపల్లి, తూర్పు, పడమర చోడవరం, తెలికిచెర్ల గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల మొదటి ఆరేళ్లు అత్యంత విలువైనవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ, ప్రాథమిక విద్యను పిల్లలకు ఆటలు, పాటలు, కథల ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. ఇది ప్రాథమిక స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలో విద్యా ప్రమాణాలు అందుకునేందుకు తోడ్పడుతుందన్నారు. దీనిపై తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు జన భాగీదారి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తెలికిచెర్లలో సర్పంచ్ బండి చిననాగరాజు (చిట్టి) తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని అన్నారు. సమిశ్రగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారి కార్యక్రమంపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.చిన్నబాబు, ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో విద్య

చాగల్లు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలు, కథల ద్వారా చక్కటి విద్య అందిస్తున్నారని చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి అన్నారు. చాగల్లు సచివాలయం–3 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.పద్మావతి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను పిల్లలకు ఇష్టమైన రీతిలో మనస్సుకు హత్తుకునేలా నేర్పిస్తున్నారన్నారు. ఎంపీటీసీ ఉన్నమట్ల విజయ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీనియర్ సిటిజన్స్

నిడదవోలు: సమాజంలో నిరాదరణకు గురవుతున్న వృద్ధులను ఆదరించాలని, వారికి రక్షణ కల్పించాలని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు కొండా నిర్మల అన్నారు. స్థానిక బీసీ సామాజిక భవనంలో సీనియర్ సిటిజన్ సంఘ అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు అధ్యక్షతన గురువారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వృద్ధులపై వేధింపుల నివారణకు చట్టాలను కఠినతరం చేయాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీగా బయలుదేరి స్థానిక రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సంఘ కార్యదర్శి అరుగొళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి పొన్నా సుబ్రహ్మణ్యం, గొప్పాబత్తుల రామారావు, ముంగండి చిట్టిబాబు, రామమూర్తి, గాజుల సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. చాగల్లు గ్రామానికి చెందిన ఆకుల పోశారావు, అతని భార్య సునీత, కుమారుడు పవన్‌తో కలసి ఈ నెల 11న మోటార్ సైకిల్‌పై పెనకనమెట్ట వెళ్లారు. తిరిగి వస్తుండగా కాపవరం జంక్షన్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయాలపాలయ్యారు. సునీత ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఏఎస్సై వై.శ్రీనివాసరావు తెలిపారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: పార్టీలకు అతీతంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం రాత్రి స్థానిక ఏడో వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు చేకూరిన లబ్ధిని మంత్రి వివరించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైస్ చైర్మన్ గండ్రోతు అంజనీదేవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, ఏడో వార్డు ఇన్‌చార్జి వేండ్ర సూరిబాబు, మహిళా అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్పందించి.. ఆదేశించి..

ఏడో వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి వనిత అక్కడ ప్రధాన రోడ్డుపై ఓ వ్యక్తి పడి ఉండడాన్ని చూసి స్పందించారు. తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వారు పరిశీలించి అతను మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వివరాలు సేకరించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని సీఐ వి.జగదీశ్వరరావును మంత్రి ఆదేశించారు. అతను ఐదో వార్డులో శివాలయం వీధికి చెందిన గుంటూరు శ్రీనివాసరాజు (45)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎండ తీవ్రతకు అతను చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

28న ప్రగతిశీల కార్మిక సమాఖ్య మహాసభ

కొవ్వూరు: ప్రగతిశీల కార్మిక సమాఖ్య (పీకేఎస్) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెండో మహాసభ 28న దేవరపల్లి మండలం దుద్దుకూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ తెలిపారు. గురువారం ఐ.పంగిడిలో కార్మిక సంఘం నాయకులతో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పౌర హక్కుల సంఘ రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకుడు దుడ్డు ప్రభాకర్, విప్లవ రచయితల సంఘ నాయకుడు అరసవల్లి కృష్ణ, ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి కోటి తదితరులు హాజరవుతారని మస్తాన్ తెలిపారు. కార్మిక సంఘం నాయకులు గంటా కృష్ణ, చిక్కాల నాగరాజు, గంగారావు, వెంకటేశ్వరరావు, ఎస్‌కే మీరా పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికి పిలుపు



కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

కొవ్వూరు: తాడేపల్లిగూడెంలో ఈ నెల 18న నిర్వహించే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనానికి సంఘీయులు హాజరై విజయవంతం చేయాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు కోరారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా సంఘ అధ్యక్షుడు కోనా శ్రీనివాస్ ఆధ్వర్యంలో చినతాడేపల్లి రోడ్డు వద్ద ఉన్న యింకూల కల్యాణ మండపంలో ఉదయం ఏడున్నర గంటలకు ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. పరిసర ప్రాంత ఆర్యవైశ్యులంతా ఆ రోజు కొవ్వూరు కల్యాణ మండపం వద్దకు రావాలని సూచించారు. ఇక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరి కార్యక్రమానికి వెళ్లాలని సంఘం నాయకులు నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్యవైశ్యుల ఐక్యతను చాటిచెప్పేందుకు ఈ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ వివరించారు. నాళం వీరవెంకట శ్రీనివాసరావు, తుమ్మలపల్లి నాగరమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎండలకు తాళలేక వేగేశ్వరపురం కాలువలో జలకాలాడుతున్న జనం

తాళ్లపూడి: భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. కొద్ది రోజులుగా మండలంలో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వేడిగాలులు తగ్గడం లేదు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రయాణించే ప్రజలు, విద్యార్థులు ముఖాలకు రక్షణ కవచాలు కప్పుకొని వెళ్తున్నారు. ఇళ్లపై కొందరు కూలింగ్ సున్నాలు వేయడంతో పాటు పచ్చి కొబ్బరాకులు, తాటాకులు పరుస్తున్నారు. ఎండలకు తాళలేక సాయంత్రం వేళలో వేగేశ్వరపురం కాలువలో జనం స్నానాలు చేస్తూ ఉపశమనం పొందుతున్నారు.